జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 55 | బుధవారం 16 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## మిగులు జలాలపై హక్కు మాకే

## అమిత్ షాకు చంద్రబాబు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 15 (సందేశం టైమ్స్): నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజులు మిగులు నీరు ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో అమిత్ షాను ఆయన నివాసంలో సీఎం కలుసుకున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై ఉభయులూ చర్చించారు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు గోదావరి వరద నీటిని తరలించేందుకు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కీలకమని చంద్రబాబు తెలిపారు. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా దీనిని రూపొందించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను వివరించారు. ఏడాదిగా క్లిష్టమైన పరిస్థితుల్లో రాష్ట్రానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ హయాంలో ధ్వంసమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో గాడిలో పెడుతున్నామని చెప్పారు. అయితే ఇప్పటికీ ఆర్థిక వనరుల కొరత తీవ్రంగా ఉందని.. కేంద్రం నుంచి మరింతగా సాయం అందించాలని ప్రత్యేకంగా కోరారు. విభజన వల్ల ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయించాలని 16వ ఆర్థిక సంఘానికి నివేదించామని తెలిపారు. అంతకుముందు.. కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించినందుకు ప్రధాని మోదీకి, అమిత్‌షాకు, కేంద్ర ప్రభుత్వానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సానా సతీశ్ ఉన్నారు.

## ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,జూలై 15 (సందేశం టైమ్స్): ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇవాళ (మంగళవారం) ఐకార్ బయోలజిక్స్?కొత్త యూనిట్?కి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## గవర్నర్ వద్దకు ఆర్డినెన్స్ ఫైలు




హైదరాబాద్, జూలై 15 (సందేశం టైమ్స్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు వీలుగా.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణకు రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ కార్యాలయానికి చేరింది. ఆ చట్టంలోని సెక్షన్ 285 (ఏ)ను సవరించాలని మంత్రివర్గం నిర్ణయం మేరకు ప్రభుత్వం ఈ ఫైలును గవర్నర్‌కు పంపింది. గవర్నర్ జిష్ణుదేవ్ దాన్ని పరిశీలించనున్నారు. నిపుణులతోనూ ఆయన చర్చించనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అన్ని సామాజికవర్గాల రిజర్వేషన్లూ కలిపి 50 శాతం మించరాదని గతంలో పలు కేసుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదే సమయంలో రిజర్వేషన్లను పెంచుకునేందుకు ప్రత్యేక సమయాల్లో పె ంచుకునేందుకు అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే చట్టసవరణ చేసి, రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 285 (ఏ)లోని 50 శాతం సీలింగ్ అనే పదాన్ని తొలగించడంతోపాటు, ఇతర సెక్షన్లలోనూ పలు సవరణలు చేయనుంది. ఈ విషయాన్నే పేర్కొంటూ గవర్నర్‌కు ఫైలును పంపింది. అలాగే రాష్ట్రంలో రిజర్వేషన్లను పెంచాల్సిన ఆవశ్యకతతో పాటు..కులగణన వివరాలను కూడా గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించినట్టు తెలిసింది. 2018 పంచాయతీరాజ్ చట్టం రాష్ట్ర పరిధిలోనిదే కావడంతో గవర్నర్ దగ్గర ఆలస్యం జరగదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## బాధ్యత రేవంత్‌రెడ్డిదే



హైదరాబాద్, జూలై 15 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల మరణాలు, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాదిలో కలుషిత ఆహారంతో వేలమంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, 100 మందికి పైగా మరణించడానికి ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని ఎక్స్ వేదికగా ఆరోపించారు. ఇన్ని విషాద ఘటనలు జరుగుతున్నా విద్యా శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి కనీసం సమీక్షించకపోవడం నియంతృత్వ, అమానవీయ పాలనకు నిదర్శనమని విమర్శించారు. "రేవంత్ కనీసం ఒక తండ్రిగా ఆలోచించాలి. ప్రభుత్వమే విషంపెడితే ఆ చిన్నారులు ఎవరికి చెప్పుకోవాలి? తన పిల్లలకు అలాంటి విషాహారం పెడితే రేవంత్‌రెడ్డి ఊరుకుంటారా?ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఆయన పిల్లలుంటే చూసీచూడనట్లు ఉంటారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాల్లో దారుణాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..మరోసారి ప్రభాకర్‌రావు విచారణ



హైదరాబాద్, జూలై 15 (సందేశం టైమ్స్): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయనను మంగళవారం సుమారు ఎనిమిదిన్నర గంటల పాటు విచారించారు. రాత్రి 7.30 సమయంలో సిట్ కార్యాలయం నుంచి పంపించారు. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి.. మోసపూరిత విధానాలతో 618 మంది వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేసిన విషయంలో ప్రభాకర్‌రావును సిట్ అధికారులు నిశితంగా విచారించారు. "నక్సల్స్ సమాచారం కోసమంటూ, మావోయిస్టులతో సంబంధం లేని రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, పారిశ్రామిక వేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయించారు? మీరు అలా చేయడానికి కారణం ఏమిటీ?.. అది మీ సొంత నిర్ణయమా? లేక ఎవరైనా ఆదేశించారా? ' అంటూ ప్రభాకర్‌రావుపై ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. మావోయిస్టుల సమాచారం కోసమంటూ ప్రభాకర్‌రావు పెట్టిన లిస్టులోని 618 మందిలో దాదాపు 300 మంది వాంగ్మూలాలను సిట్ అధికారులు ఇప్పటికే నమోదు చేశారు. ఈ వాంగ్మూలాలను ప్రభాకర్ రావు ముందు పెట్టి, వీరంతా మావోయిస్టులతో సంబంధం లేని వారే కదా?? ఎందుకు మీరు ఆ విధంగా చేయాల్సి వచ్చిందంటూ ప్రశ్నించారు. ప్రభాకర్ రావు చాలా ప్రశ్నలకు సమాధానమివ్వలేదని, విచారణకు సహకరించలేదని.. "గుర్తులేదు.. తెలియదు" అనే సమాధానాలు ఇచ్చారని తెలుస్తోంది. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులు ప్రభాకర్‌రావు ఆదేశాలను పాటించినట్లు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే..! దీన్ని ప్రభాకర్‌రావు తప్పుబడుతూ వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. "పోలీసు కస్టడీలో వాంగ్మూలానికి చట్టబద్ధత లేదు. మీరు రాసుకునేది రాసుకుంటారు. రాయించేది రాయిస్తున్నారు. నా సర్వీసు మొత్తంలో ఉన్నతాధికారులు చెప్పినట్లే చేశాను. నాపైన చాలా మంది అధికారులు ఉన్న సంగతి మీకూ తెలుసు. అంతా ఉన్నతాధికారులకు తెలుసు" అని మంగళవారం నాటి విచారణ సందర్భంగా ప్రభాకర్‌రావు వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న వారికి పోస్టింగ్, పదోన్నతి వద్దు

హైదరాబాద్, జూలై 15 (సందేశం టైమ్స్): అవినీతి నిరోధక సంస్థ(ఏసీబీ) కేసులు ఎదుర్కొంటున్న అధికారులకు విచారణకు పూర్తయ్యే దాకా పోస్టింగులు, పదోన్నతులు ఇవ్వకూడదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఏసీబీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చెయ్యాలని కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఓ లేఖ రాశారు. ఏసీబీ నమోదు చేసిన కేసుల విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, చాలా కేసులు వీగిపోతున్నాయని ఎఫ్‌జీజీ తెలిపింది. ఫలితంగా ఏసీబీ కేసుల్లో శిక్ష పడుతుందనే భయం అధికారులకు లేకుండా పోయిందని పేర్కొంది. పెద్దపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఏఈ జగదీశ్‌బాబు, వాణిజ్య పన్నుల శాఖ డీసీటీఓ డి.శ్రీనివాసరెడ్డిపై ఏసీబీ కేసులు నమోదై, విచారణ కొనసాగుతుండగానే ఫోకల్ పాయింట్లలో పోస్టింగులు, పదోన్నతులు పొందారని తెలిపింది. ఇలాంటి కేసులను దీర్ఘకాలికంగా విచారణలో ఉంచడం వల్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని పోస్టింగులు, పదోన్నతులు పొందుతున్నారని వివరించింది. ఈ నేపథ్యంలో ఏసీబీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరింది.

# మానవత్వాన్ని చాటిన త్రిష రాజనర్సింహా .



సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి( జూలై 14): నోటిమాటలు రాక ఇబ్బంది పడుతున్న జాన్సన్ (8) ను స్పీచ్ థెరపీ శిక్షణ స్కూల్ లో అడ్మిషన్ ఇప్పించాలని త్రిష రాజనర్సింహా గారిని కలసి విజ్ఞప్తి చేసిన వారి తల్లిదండ్రులు .జాన్సన్ తల్లిదండ్రుల విజ్ఞప్తి పై తక్షణం స్పందించి పినాకిల్ సంస్థ యాజమాన్యం తో మాట్లాడి స్పీచ్ థెరపీ లో అడ్మిషన్ ఇప్పించిన త్రిష రాజనర్సింహా . నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడు జాన్సన్ (8) స్పీచ్ థెరపీ కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహా గారిపై ఉన్న అభిమానం తో స్పీచ్ థెరపీ శిక్షణ కోసం పినాకిల్ బ్లూమ్స్ నెట్వర్క్ సంస్థ 1లక్ష 70 వేల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించింది . స్పీచ్ థెరపీ కోసం పినాకిల్ సంస్థ ఇచ్చిన 1లక్ష 70 వేల రూపాయల చెక్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహా జాన్సన్ తల్లిదండ్రులకు అందించారు .స్పీచ్ థెరపీ శిక్షణ కోసం సాయంగా నిలిచిన మంత్రి దామోదర్ రాజనర్సింహా , త్రిష రాజనర్సింహా గార్లకు జాన్సన్ తల్లిదండ్రులు కృత్జతలు తెలిపారు .అందోల్ నియోజక వర్గం లోని రేగోడ్ మండలం పెద్దతాండ లోని నిరుపేద కుటుంబానికి కు చెందిన వడ్యా జాన్సన్ చిన్నప్పటి నుండి నోటి మాటలు సరిగ్గా రాకపోవడం తో ఆందోళన చెంది స్పీచ్ థెరపీ కోసం స్పీచ్ థెరపీ స్కూల్ లో అడ్మిషన్ ఇప్పించాలని వారి తల్లిదండ్రులు త్రిష రాజనర్సింహా గారిని కలసి విజ్ఞప్తి చేసారు. వారి విజ్ఞప్తి పై మానవత్వం తో చలించి వడ్యా జాన్సన్ కు స్పీచ్ థెరపీ కోసం నిజాం పేట్ లోని ప్రముఖ స్పీచ్ థెరపీ స్కూల్ పినాకిల్ స్పీచ్ థెరపీ స్కూల్ లో శిక్షణ కోసం అడ్మిషన్ ఇప్పించారు . అవసరమైన డబ్బులను మంత్రి దామోదర్ రాజనర్సింహా గారిపై ఉన్న అభిమానం తో పినాకిల్ సంస్థ స్పీచ్ థెరపీ కోసం 1లక్ష 70 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా గారి చేతుల మీదుగా సంగారెడ్డి లోని తన నివాసం లో అందించి అండగా నిలిచారు. స్పీచ్ థెరపీ కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహా , త్రిష రాజనర్సింహా గార్లు అందించిన సాయం పై జాన్సన్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు .

# పంటలకు సాగర్ నీటిని విడుదల చేయాలి

## రాష్ట్ర బీసీ నాయకులు తూనం. వెంకటేశ్వరరావు.



అనంతగిరి జులై 15. (సందేశం టైమ్స్) నాగార్జున సాగర్ కాలవ నుంచి నీటిని విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర బీసీ నాయకులు. తూనం. వెంకటేశ్వరరావు అన్నారు. కోదాడ నియోజకవర్గంలో ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైంది. చాలా చోట్ల రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాగర్ నీళ్ల అవసరం ఉంటుందని చెప్పారు. కానీ ఇప్పటివరకు నీరు విడుదల చెయ్యకపోవడం దారుణమని మండిపడ్డారు. సాగర్ కాలవ నుండి నీటిని విడుదల చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రతిసారి ముందస్తుగా నీటిని విడుదల ప్రారంభమయ్యేది. కానీ ఈసారి మాత్రం జాప్యం జరగడంతో రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం కొందరు రైతులు బోరు బావలను నమ్ముకొని పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. సాగర్ కాలువ నుండి నీటిని విడుదల చేస్తే నడిగూడెం అనంతగిరి మండలాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు. చాకిరాల మేయర్ రిజర్వాయర్ నిండి దిగువన ఉన్న కాలువలకు నీరు విడుదల చేస్తే రెండు మండలాల్లో చాలా చెరువులు నిండుతాయని చెప్పారు. ఈసారి కూడా త్వరగా నీళ్లు వదిలితే రైతులకు ఉపయోగంగా ఉంటుందని పేర్కొంటున్నారు. నాగార్జునసాగర్ నుంచి ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ కు నీటిని వదిలారు కానీ కొత్తగూడెం మేయర్ కాలువకు మాత్రం నీటిని విడుదల చేయడం లేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు నాయకులు స్పందించి నీటిని విడుదల చేసి రైతులు పంటలు సాగు చేసే విధంగా చూడాలని తూనం.వెంకటేశ్వరరావు. కోరుతున్నారు.

# బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులకు మరియు సందేశం టైమ్స్ సీఈఓ వెంకటేష్ కు ట్రూత్ వివేకమృతం అద్వైత మహా శాస్త్రం పుస్తకాన్ని అందజేసిన సంస్థ సాధకులు.





కోదాడ నియోజకవర్గానికి విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రామచంద్ర రావు, శ్రీ జగడం సుధాకర్ (బిజెపి రాష్ట్ర నాయకులు),చిలుకూరి శ్రీనివాస్ బిజెపి జిల్లా నాయకులు మరియు సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక సీఈవో శెట్టి వెంకటేష్ గౌడ్ ను ఒక కార్యక్రమంలో కలవడం జరిగింది ఈ సందర్భంగా సంస్థ సాధకులు వారు మాట్లాడుతూ మేము ట్రూత్ వివేకామృతం సంస్థ సాధకులం. మా గురువు శ్రీ వివేకానందగారు. మా గురువైన వివేకానంద గారు భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు మొదలైన వాటిలోని అంతరార్థాన్ని ఉపదేశించి వాటిని మా జీవన విధానంగా మల్చుకు నేటట్లుగా ప్రబోధిస్తున్నారు. ఈ జ్ఞానాన్ని విన్న మానవుడు తనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞానమార్గంలోకి ప్రవేశిస్తాడు. భగవద్గీత గాని, వేదాలు కానీ, ఉపనిషత్తులు కానీ ఇవి కేవలం ఒక మతానికి సంబంధించిన గ్రంథాలు కావు . ప్రతి ఒక్క మానవుడు వీటిలో ఉన్నటువంటి అంతరార్థాలని అర్థం చేసుకోగలిగితే వారిలో ఉన్న అరిషడ్వర్గాలను అధిగమించి సన్మార్గుడిగా జీవించనారం భిస్తాడు. ఇది ప్రతి ఒక్క మానవుడు తెలుసుకొని తీరాల్సిన అంశాలు.మా గురువుగారు చేపట్టిన ఈ జ్ఞాన యజ్ఞాన్ని ప్రతి ఒక్కరికి అందించాలన్న శుభసంకల్పంతో ఈరోజు మేము తెలంగాణ రాష్ట్ర నూతన బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికైనటువంటి నారపరాజు రామచంద్రరావు గారిని కలవడం జరిగింది. ఆయనకు ఈ గ్రంథాలను అందించడం జరిగింది. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ఇట్టి సంస్థ యొుక్క యుూట్యూబ్ ఛానల్ ట్రూత్ వివేకామృతం. ఈ జ్ఞానం పట్ల ఆసక్తి ఉన్నవారు ఈ ఛానల్ ని సబ్స్క్రైబ్ చేసుకొని ఆ గురువుగారి వీడియోలను చూడవచ్చు.ఇట్టి కార్యక్రమంలో ట్రూత్ వివేకామృతం కోదాడ సాధకులు తెల్లాకుల వెంకటేశ్వరరావు గారు, వెలిశాల విజయలక్ష్మి, వల్లంశట్ల శ్రీలత , భవాని పాల్గొన్నారు.

# సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ



జులై 15. (సందేశం టైమ్స్) కరీంనగర్)

ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతున్నది. కరోనా కాలం నుంచి చైనా, ఇతర దేశాలకు తగ్గిన ఎగుమతులతోపాటు రాయల్టీ, మినరల్ ఫండ్, సి పర్మిట్ పేరిట 85 శాతం పన్నులు పెరగడంతో పరిశ్రమ కుదేలవుతున్నది. పెరిగిన పన్నులతో నష్టాల్లో కూరుకుపోయే పరిస్థితి ఉత్పన్నం కావడంతో మూడు రోజులపాటు పరిశ్రమ బంద్ నిర్వహించారు. యజమానులు, కార్మికులు రోడ్లపైకి వచ్చి ప్రదర్శన నిర్వహించాల్సి వచ్చింది.

30 వేల మందికి ఉపాధి

గతంలో గ్రానైట్ పరిశ్రమ బాగా నడవడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో 300 క్వారీలు లీజులు తీసుకున్నారు. వీటిలో రాయిని వెలికితీసి చైనా, తదితర దేశాలకు గ్రానైట్‌ను ఎగుమతి చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తున్నది. దేశంలోని సుమారు 8 రాష్ట్రాలకు చెందిన ప్రజలు వివిధ విభాగాల్లో కార్మికులుగా పనిచేసేందుకు వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. 2014లో 300 మేరకు క్వారీలు నడవగా ప్రస్తుతం 60 క్వారీలు మాత్రమే పని చేస్తున్నాయి. క్వారీలు అన్ని ఉత్పత్తి చేసినప్పుడు 24 లక్షల టన్నుల గ్రానైట్ ఎగుమతి కాగా, ఇప్పుడు ఈ క్వారీల నుంచి 10 లక్షల టన్నుల గ్రానైట్ మాత్రమే ఎగుమతి అవుతున్నది.

మూడు సంవత్సరాల్లో 115 శాతం పెరిగిన పన్నులు

రివిజన్ పేరిట 2022లో 30 శాతం రాయల్టీని పెంచారు. ఒక క్యూబిక్ మీటర్ గ్రానైట్ రాయిపై 2,300 నుంచి 2,990 రూపాయలకు రాయల్టీ పెరిగింది. ఇదే సమయంలో పర్మిట్ సి పేరిట 40 శాతం పన్ను పెంచారు. దీంతో ఒక్కో క్యూబిక్ మీటర్‌పై 1,200 రూపాయల మేరకు భారాన్ని భరించాల్సి వస్తున్నదని క్వారీ యజమానులు వాపోతున్నారు. 10 శాతంగా ఉన్న డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌ను ఒకేసారి 20 శాతానికి పెంచడంతో క్యూబిక్ మీటర్ 300 రూపాయల నుంచి 600 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మినరల్ ఫండ్ 10 శాతం మాత్రమే ఉంది. రాయల్టీ, రివిజన్, పర్మిట్ సీ, డీఎంఎఫ్ పేరిట ఒకేసారి 85 శాతం పన్నులు పెరగడంతో ఆర్థిక భారాన్ని భరించలేని యజమానులు 2022లోనే ఆనాటి ప్రభుత్వాన్ని పన్నులు తగ్గించాలని కోరారు. రెండు సంవత్సరాలపాటు పర్మిట్ సి పన్నును 40 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. ఆ పరిమితి గడువు ముగియడంతో ఇప్పుడు మళ్లీ 40 శాతం పన్నును చెల్లించాల్సి వస్తున్నదని పరిశ్రమవర్గాలు వాపోతున్నాయి. మూడు సంవత్సరాల వ్యవధిలో పరిశ్రమపై 115 శాతం పన్ను భారం పెరిగి దానిని తట్టుకోలేక క్వారీలు మూసేయాల్సిన పరిస్థితి వస్తున్నదని పరిశ్రమ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

భారంగా నిర్వహణ ఖర్చులు

ఒకవైపు ఎగుమతులు తగ్గిపోవడంతో లాభాల మాట అటుంచి యంత్రాలు చెడిపోకుండా చూసుకోవాల్సి వస్తోంది. ఉన్న కార్మికులకు ఉపాధి కల్పించడానికి క్వారీల నిర్వహణ పనులు చేయాల్సి వస్తోంది. ఈ ఖర్చు భారంగా మారింది. ఎగుమతులు తగ్గడంతో స్థానిక మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తున్నది. ఈ పరస్థితుల్లో పన్నులు మినహాయించి పరిశ్రమను కాపాడాల్సిన ప్రభుత్వం అదనపు భారాన్ని మోపుతోంది గ్రానైట్ వ్యాపారులు అంటున్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమపై పన్నుల భారం తగ్గించాలని కోరుతున్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రేణుక మాత బోనాల ఊరేగింపు

## ముఖ్యఅతిధిగా టీపిసిసి వైస్ ప్రసిడెంట్ పట్లోళ్ల సంగమేశ్వర్ పాల్గొన్నారు

## బోనం సమర్పించి మొకులు చెల్లించుకున్న గౌడ సంఘము సభ్యులు







సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15జులై సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వెల్లి గ్రామం లో శ్రీ రేణుక మాతకు ఆషాడ మాసం పురస్కరించుకొని ఉన్నటువంటి పండుగను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, దీప దూప నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడపడుచులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొకులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లతో బోనాలు నెత్తిన పెట్టుకొని కాలినడకన శ్రీ రేణుక మాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్ళు

శివసత్తుల పూనకాలతో పండుగ సందడి హోరెత్తింది. టీపిసిసి వైస్ ప్రసిడెంట్ మాట్లాడుతూ. ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని,వానలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రతి ఇంటా పసిడిసిరులు కురవాలని ఆ అమ్మవారికి వేడుకున్నట్టు తెలిపారు.. అనంతరం తీర్థ ప్రసాద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ,మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు, విద్య కమిటీ చైర్మన్ చిన్న నర్సిములు,కాలాలి సతీష్ గౌడ్, తుల్జరం గౌడ్, రమేష్ గౌడ్, కాలాలి నర్సింహా గౌడ్, మంగలి వీరయ్య, రేగోటి నరేష్, గౌడ్ సంఘము సభ్యులు, మరియు తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## పెన్షనర్లకు న్యాయం చేయాలి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన పెన్షనర్లు%-%వర్గీకరణ చట్టం వల్ల పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. పెన్షనుదారులను విధులు ముగిసిన సంవత్సరం, పదవీ విరమణ తేదీ, లేదా నియమాల ఆధారంగా వేర్వేరు వర్గాల్లో ఉంచటం వల్ల ఒకే విధిగా సేవ చేసినవారు వేర్వేరు లాభాలు పొందే అవకాశం ఉంది. సీనియర్ పెన్షనర్లకు తక్కువ, జూనియర్ పెన్షనర్లు ఎక్కువ పెన్షన్ పొందే పరిస్థితులు ఏర్పడతాయి. సమాన విధులు నిర్వహించిన వారికి సమాన పెన్షన్ రావాలని సుప్రీంకోర్టు పలుమార్లు తీర్పులు ఇచ్చినా, ఈ చట్టం ఆ ఆదేశాలను బైపాస్ చేసేలా తయారైందని పెన్షన్‌దారులు అభిప్రాయపడుతున్నారు.

1979లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ పాలసీని అమలు చేసింది. దీని ప్రకారం, 1979 మే 31 తర్వాత పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కొత్త పెన్షన్ లబ్ధిని వర్తింపజేస్తామని తెలిపింది. అంతకుముందు పదవీ విరమణ పొందిన వారికి ఈ పెన్షన్ సౌకర్యాలు వర్తించవని నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ డి.ఎస్. నకారా అనే పెన్షన్‌దారు, మరికొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో "పెన్షన్ అనేది సౌకర్యం కాదు, అది ఒక హక్కు. ఉద్యోగ సమయంలో చెల్లించిన సేవలకు ప్రతిఫలంగా ఇచ్చే సామాజిక భద్రత, విభజన అసమంజసం... పెన్షన్ విధానంలో మార్పులు, పెంపులు అన్నీ అంతకుముందు పదవీ విరమణ పొందినవారికీ వర్తించాలి." అని సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. పెన్షనుదారుల హక్కులకు, భద్రతకు ముప్పు తలపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 'పెన్షనర్ల వర్గీకరణ చట్టం'పై రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్‌దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అమలుతో వేతన సవరణ, అరియర్స్, కరువుభత్యాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో పెన్షన్‌దారులకు అన్యాయాలు జరుగుతున్నాయని పెన్షన్‌దారుల సంఘం పేర్కొంది. పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపుతో, ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారుల సంఘం ప్రధానమంత్రికి ఒక వినతిపత్రాన్ని పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో పెన్షన్‌దారుల సంక్షేమానికి అనేక చొరవలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో స్పందించి కేంద్రం దిశానిర్దేశం చేసిన చట్టాల వల్ల రాష్ట్ర పెన్షన్‌దారులకు తలెత్తిన సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని పెన్షన్‌దారులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి చేసిన విజ్ఞప్తి లేఖలో పెన్షనర్లకు 12వ పీఆర్‌సీ అమలు, 35 శాతం మధ్యంతర భృతి, తగ్గించిన అదనపు క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ, కమ్యుటేషన్ కాల పరిమితి 15 నుంచి 11 సంవత్సరాలకు తగ్గించడం వంటివి ఉన్నాయి. అలాగే ప్రభుత్వ ఉత్తర్వులు నెం.315లో మార్పులు చేసి కుటుంబ పింఛను అమలులో న్యాయం చేయడం, యూజీసీ స్కేల్స్‌లో సేవ చేసిన వారికి హక్కుల అమలు, 10వ పీఆర్‌సీ నిర్ణయించిన మేరకు అంత్యక్రియ ఖర్చులు కొనసాగించడం, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించడం, వేతన సవరణ బకాయిలు, కరువు ఉపశమనం బకాయిలు విడుదల చేయడం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పూర్తిగా చెల్లించడం వంటివి ఉన్నాయి. పెన్షన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆరోగ్య బీమా కార్డులు అందరికీ పరిమితుల్లేకుండా జారీ చేయాలని కూడా కోరారు. దేశ నిర్మాణానికి ప్రధాన శక్తిగా పని చేసిన పెన్షన్‌దారుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి, వారికి సరైన న్యాయం చేయాలి.

# టీటీడీ ఆలయాల్లో ఆణివార ఆస్థానం



తిరుపతి: జూలై 15(సందేశం టైమ్స్):గోవిందరాజస్వామి, కోదండరామాలయాల్లో రేపు (బుధవారం, జులై 16)న ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆ పేరు వచ్చింది. గోవిందరాజస్వామి ఆలయంలో బంగారువాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందుడిని వేదిక పైకి తీసుకువచ్చిన తర్వాత ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా స్వామివారికి సమర్పిస్తారు. కోదండరామాలయంలో గరుడాళ్వార్ అభిముఖంగా సీతాలక్ష్మణ సమేత రాములవారిని తీసుకువచ్చి ప్రత్యేక ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం నూతన వస్త్రాలను మూలవరులకు, ఉత్సవ వరులకు అలంకరిస్తారు.అలాగే.. తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 17వ తేదీన ఆణివార ఆస్థానం జరగనుంది. ఏటా సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతి నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చింది. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజైన ఈ ఆణివార ఆస్థానం పర్వదినం నాటి నుంచి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ బోర్డు ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి – ఏప్రిల్ నెలలకు మార్చారు. కాగా.. 17వ తేదీ సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్పపల్లకిలో కొలువు దీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఆణివార ఆస్థానం సందర్భంగా 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

# ఏపీఎండీసీ ప్రాజెక్టులపై టాస్క్‌ఫోర్స్




జూలై జూలై 15(సందేశం టైమ్స్):ఏపీఎండీసీ చేపట్టనున్న నూతన ప్రాజెక్టుల పర్యవేక్షణ, పరిశీలన కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనులశాఖ సీనియర్ జాయింట్ డైరెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటయిన ఈ టాస్క్‌పోర్స్‌లో గనుల శాఖ డీడీ, ఏడీ, ఏపీఎండీసీ ఉపాధ్యక్షుడు(హెచ్‌బీఎస్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ఏపీఎండీసీ చేపట్టే కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ప్లాన్ ఆమోదం, లీజుల మంజూరు, ఎల్‌ఓఐ, వర్క్ ఆర్డర్ జారీ తదితర పనులు వేగంగా అమలయ్యేలా చూడటం.. వంటి బాధ్యతలను టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. ఇదిలా ఉంటే, గనుల శాఖలో డైరెక్టర్, అదనపు డైరెక్టర్ ఉంటారు. ప్రస్తుతానికి గనుల శాఖకు రెగ్యులర్ డైరెక్టర్ లేరు. ఆ శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమారే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అదనపు డైరెక్టర్‌గా సీనియర్ అధికారి ఉన్నారు. ఆ శాఖలో డైరెక్టర్ తర్వాత సీనియర్ పోస్టు అదే. ఇంత కీలకమైన టాస్క్‌ఫోర్స్‌లో అదనపు డైరెక్టర్‌కు బదులు సీనియర్ జేడీకి కీలక బాధ్యతలు అప్పగించడం చ ర్చనీయాంశంగా మారింది. గనుల శాఖలో జేడీ పోస్టు ఉంది కానీ సీనియర్ జేడీ పోస్టులేదు. మరి ఈ టాస్క్‌ఫోర్స్‌కు సీనియర్ జేడీని ఎక్కడి నుంచి తీసుకొస్తారనే చర్చ జరుగుతోంది.

# 691 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

### 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులు
### కూటమి ప్రభుత్వంలో తొలి నోటిఫికేషన్
### కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలు రెన్యువల్




అమరావతి,జూలై 15(సందేశం టైమ్స్): కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ మొదటి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే మెగా డీఎస్సీ వచ్చినా ఏపీపీఎస్సీ ద్వారా ఇదే తొలి నోటిఫికేషన్. అటవీ శాఖలో 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్‌ను జారీచేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈనెల 16 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. స్పోర్ట్స్ కోటా ఖాళీలు, ఎస్సీ గ్రూపుల వారీగా ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలను రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 693 మంది లెక్చరర్ల సేవలు కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11 నెలలపాటు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది.

# దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



కర్నూలు క్రైం,జూలై 15 (టుడే విదుర)::నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దపాడు సమీపంలో దారి దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ప్రధాన నిందితుడు రమేష్ (వాసవి నగర్, కర్నూలు), మరో ఇద్దరు బాల నేరగాళ్లు ఉన్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన నూర్ బాషా అనే వ్యక్తి ఈ నెల 5వ తేదీన తెల్లవారుజామున హైదరాబాదు నుంచి కర్నూలు వచ్చారు. తెర్నేకల్లు వెళ్లాలని బళ్లారి చౌరస్తా వద్ద నిల్చుని ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగారు. మెయిన్ రోడ్డులో ఉండే కడివేముల వద్ద దిగుతానని నూర్‌బాషా చెప్పారు. తాము కూడా బళ్లారి వెళ్తున్నామని, రూ.100కు టికెట్ మాట్లాడుకుని నూర్‌బాషాను కారులో ఎక్కించుకున్నారు. పెద్దపాడు దాటిన తర్వాత ఆయనను కొట్టి సెల్‌ఫోన్, ఏటీఎం, క్రెడిట్‌కార్డు బలవంతంగా లాక్కున్నారు. ఫోన్ పే ద్వారా రూ.12వేల నగదును మరొకరి అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ చేసుకు న్నారు. రూ.6,500 నగదు లాక్కొని నెరవాడ సమీపంలో కారు నుంచి బయటకు తోసేసి వెళ్లిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం కర్నూలులో ముగ్గురిని అరెస్టు చేసి చేసి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డు, దోపిడీ చేసిన రూ.12వేలు, కారు స్వాధీనం చేసుకున్నారు. మద్యానికి బానిసై దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# సీటుకు రేటు..!



**♦ అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు డిమాండ్**
**♦ ముడుపులు ఇస్తేనే భర్తీ ♦ పోటీలో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు**
**♦ మరో రెండు పోస్టులున్నా నియమించడంలో ♦ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం**

అనంతపురం కలెక్టరేట్‌జూలై 15(సందేశం టైమ్స్):సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్య పంపకాలే అన్నది బహిరంగ రహస్యమే. అక్కడ కీలకమైన సబ్ రిజిస్ట్రార్ పోస్టుపైనే అందరి దృష్టి ఉంటుంది. అందులోనూ కీలకమైన కార్యాలయాల్లో ఆ పోస్టుకుండే డిమాండ్ అంతాఇంతా కాదు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ పోస్టు కూడా ఆ కోవలోకే వస్తుంది. జిల్లాలో రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరువాత అత్యధిక డాక్యుమెంట్లు జరిగే కార్యాలయం ఇదే. ఇందులో సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు ఎప్పటిలాగే ఈసారి కూడా డిమాండ్ ఏర్పడింది. ముగ్గురు అధికారులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఓ కీలక అధికారికి ముడుపులు అందజేస్తేనే ఆ సీటు భర్తీ అవుతుందనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మరో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆ సీట్లు ఖాళీగా ఉన్నా రూరల్ సీటుకే డిమాండ్ ఉండటం గమనార్హం. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ సీటులో కూర్చోవాలంటే ముడుపులివ్వాల్సిందేనన్న గుసగుసలు ఆ శాఖలో వినిపిస్తున్నాయి. రూరల్ మండలంలోని భూములు అనంతపురం నగరానికి సమీపంలో ఉండటంతో వాటి ధరలు అధికంగా ఉంటున్నాయి. రిజిస్ట్రేషన్లు జరిగితే లావాదీవీలు ఎక్కువగానే ఉంటాయి. దీనికి తోడు కొన్ని చుక్కల, వివాద భూముల డాక్యుమెంట్ల విషయంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఓ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి దొరికారు. ముడుపులిచ్చేవారే ఈ సీటులోకి వస్తుంటారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆమ్యామ్యాలిచ్చుకోవాల్సిందేనన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఆ బేరసారాలు ఇంకా ముగిసినట్లు లేవు. అందుకే ఆ సీటు భర్తీ కాలేదని తెలుస్తోంది. పది రోజులైనా అక్కడ ఎవరినీ నియమించకపోవడమే ఇందుకు నిదర్శనం. రాయలసీమ స్థాయిలో ఓ ఉన్నతాధికారికి ఆ ముడుపులు అందుతాయని సమాచారం.అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు ఎప్పటిలాగే ఈసారి డిమాండ్ ఏర్పడింది. ఏకంగా ఆ సీటులోకి రావడానికి ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు పోటీ పడుతున్నారు. హిందూపురంలో పనిచేస్తున్న రాజశేఖర్, సెలవులో ఉన్న శిరీషా భరత్, కడప జిల్లా రాయచోటిలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ సత్తార్ ఆ సీటులోకి రావడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆ పోస్టుకు అధికారిని కేటాయించడానికి మరో వారం రోజులైనా ప డుతుందని ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ టీజీ రెడ్డి కొనసాగవచ్చనే ప్రచారమూ లేకపోలేదు.జిల్లాలో మరో రెండు సబ్ రిజిస్ట్రార్ పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కళ్యాణదుర్గం, తాడిపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా ఉన్నారు. ఆ రెండు స్థానాలకు ఎవరినీ నియమించలేదు. కళ్యాణదుర్గంలో ప్రస్తుత అధికార పార్టీ నేతల పరిచయంతో ఆ సీటుకు మరొకరిని రానిచ్చే పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తోంది. తాడిపత్రిలో ఆయన స్థానికంగా ఉండటంతో రాజకీయంగానూ ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఓ సబ్ రిజిస్ట్రార్ అక్కడికి రావడానికి ప్రయత్నించినా వీలుకాలేదని తెలిసింది. మరి కొంతకాలం ఆ పోస్టుల్లో సబ్ రిజిస్ట్రార్లను ఉన్నతాధికారులు నియమించే ధైర్యం చేయలేరనే ప్రచారం జరుగుతోంది.

# బైకు దొంగల అరెస్టు



కర్నూలు క్రైంజూలై 15(సందేశం టైమ్స్):త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్య సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితులు షేక్ బాబ ఫక్రుద్దీన్ (అన్నమయ్య జిల్లా), షేక్ దాదాపీరా (అన్నమయ్య జిల్లా), హనీఫ్ (కడప)లను అరెస్టు చేశామన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... గూడూరుకు చెందిన చంద్రకుమార్ మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 23 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలు, నంద్యాల, గుంతకల్లు, హైదరాబాదు, నార్పల, అనంతపురం జిల్లాలో పలు బైక్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. సుబాన్, షాపీర్ అనే నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# పేలిన ఎలక్ట్రికల్ స్కూటీ బ్యాటరీ

**స్కూటీలకు నష్టం**
**ఎండలో ఉంచడమే కారణమా?**



బొబ్బిలి, జూలై 15(సందేశం టైమ్స్):బొబ్బిలి పట్టణ పరిధిలోని సిరిపురపువీధిలో వంతరాం రోడ్డు పక్కన పక్కి రమేష్‌కు చెందిన ఎలక్ట్రికల్ స్కూటర్ బ్యాటరీ మధ్యాహ్నం పేలిపోయింది. ఘటనలో స్కూటర్ వెనుకభాగమంతా పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో పక్కనే ఉన్న మరో వాహనానికి కూడా మంటలు వ్యాపించాయి. పేలిన శబ్ధం, మంటలను గమనించిన వెంటనే రమేష్ పరుగున ఇంట్లో నుంచి బయటకు వచ్చి పైపులైన్‌తో మంటలు అదుపు చేశారు. ఎండ చాలా తీవ్రంగా ఉండడం, మధ్యాహ్న భోజనాల సమయం కావడంతో రోడ్డుపై జనసంచారం కూడా కాస్త తక్కువగా ఉంది. దీంతో పెద్ద అపాయం తప్పినట్లయింది. నాలుగేళ్లుగా తాను ఈ విద్యుత్ ద్విచక్రవాహనాన్ని వినియోగిస్తున్నట్లు యజమాని పక్కి రమేష్ తెలిపాడు. గతంలో బొబ్బిలి పట్టణంలో బ్యాటరీ చార్జింగ్ చేస్తుండగా ఇంట్లో ఓ విద్యుత్ స్కూటర్ పేలిపోయిందని, అప్పటి నుంచి ఈ స్కూటర్‌ను ఆరుబయటే ఉంచుతున్నానన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎటువంటి చార్జింగ్ పెట్టలేదని, ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ఇలా జరిగి ఉండవచ్చునని అభిప్రాయపడ్డాడు.

# రూ.75.13 లక్షల విత్తనాలు, ఎరువుల సీజ్



–గుంటూరు జూలై 15(సందేశం టైమ్స్):వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖ సంయుక్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ దారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించా రు. 3 విత్తన దుకాణాల్లో రూ.60.17 లక్షల విలువైన మిరప, సోయా బిన్స్ విత్తనాలను సరైన రికార్డులు చూపించని కారణంగా విక్రయాలు నిలుపుదల చేశారు. 4 ఎరువుల దుకాణాలలో రూ.1.66 లక్షల విలువైన 5.35 టన్నుల ఎరువులను, 3 పురుగు మందుల దుకాణాలలో రూ.14.13 లక్షల విలువైన 3460 లీటర్ల పురుగు మందుల విక్రయాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఎడిఎ పి.మురళీకృష్ణ, గన్నవరం ఎడిఎ ఎం.సునీల్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కె.వెంకటేశ్వర్లు, సిహెచ్.రవిబాబు, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ వ్యవసాయాధికారి సునీల్‌కుమార్, గుంటూరు రూరల్ మండల వ్యవసాయాధికారి బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

# మిర్చికి జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ నాగలక్ష్మి




గుంటూరు జిల్లా ప్రతినిధి జూలై 15(సందేశం టైమ్స్): వ్యవసాయ ఉత్పత్తుల్లో గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కగా అవార్డును ఢిల్లీలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం అందుకున్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి పథకం కింద గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి దక్కిన విషయం తెలిసిందే. వ్యవసాయ ఉత్పత్తుల్లో స్వర్ణ కేటగిరి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా నాగలక్ష్మీ మాట్లాడుతూ గుంటూరు మిరపకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందడం చాలా గర్వకారణమైన విషయమ న్నారు. జిల్లా తరుపున ఈ అవార్డు అందుకో వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా , కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత పరిశ్రమ ల శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు.

# పలాస జీడి పప్పునకు 'జాతీయ అవార్డు'

శ్రీకాకుళం, జూలై 15(సందేశం టైమ్స్):శ్రీకాకుళం జిల్లా ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా చాటి చెబుతూ పలాస జీడిపప్పు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కింద ఉత్తమ ఉత్పత్తిగా ఎంపికై జాతీయ అవార్డును పొందింది. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ అవార్డును కేంద్ర పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర వస్త్రోత్పత్తుల మంత్రి జితిన్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవితల చేతుల మీదుగా అందుకు న్నారు. జిల్లా ఉద్యానవన అధికారి ప్రసాదరావు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'తితలీ తుఫాన్ తీవ్రంగా నష్టపరిచినా.. అదే ఓ మలుపుగా మారింది. పునరుద్ధరణ చర్యలు, అధిక దిగుబడినిచ్చే జాతుల ప్రోత్సాహం. ఉపాధి హామీ పథకం విని యోగంతో సాగు విస్తరించింది. జీడిపప్పు ప్రాసె సింగ్ పరిశ్రమలకు కొత్త దిశ చూపగలిగాం. ఇది రైతుల కృషికి, అధికార యంత్రాంగ ప్రణాళికా బద్ధ మైన కార్యాచరణకు లభించిన గుర్తింపు' అని పేర్కొన్నారు.

# అక్రమంగా గంజాయి రవాణా.. నిందితులు అదుపులో

## గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్
## రూ. 9.06 లక్షల వెండి, బంగారం, మోటార్ సైకిల్ సీజ్
## వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య



సింగరాయకొండజూలై 15(సందేశం టైమ్స్): అడ్డదారిలో నగదు సంపాదించాలనే దురాశతో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను జరుగుమల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 3.100 కిలోల గంజాయిని, రూ.8 లక్షల విలువచేసే 8 కేజీలు వెండి (57 కడ్డీలు), 9 గ్రామల బంగారం (రూ. 81వేలు), రూ.25 వేలు విలువచేసే మోటార్ బైక్‌ను సీజ్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య జరుగుమల్లి ఎస్సై బత్తుల మహేంద్రతో కలిసి వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాలు మేరకు.. ఒంగోలు నుంచి చెన్నై వెళ్లు జాతీయ రహదారి 16 పై జరుగుమల్లి మండలం వావిలేటిపాడు క్రాస్‌రోడ్డు ఇటుకల బట్టీల వద్ద అక్రమ గంజాయి రావాణా చేస్తున్నరనే సమాచారంలో పోలీసులు అక్కడికి వెళ్లారు. సంఘటనా స్థలంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌కి చెందిన ముకేషకుమార్, గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకి చెందిన ఒడ్లమాను శివారెడ్డి, ఒంగోలుకి గుర్రం జాషువా నగర్‌కు ట్రంకు కార్తీక్ చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులు ముగ్గురిని పోలీసులు విచారించారు. అందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముకేషకుమార్ సుమారు నాలుగేళ్ల నుంచి మద్దిపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మద్దిపాడు హైవేపై లారీ డ్రైవర్ల నుంచి తక్కువ రేటుకి డిజిల్ కోనుగోలుచేసి ఎక్కువ రేటుకి అమ్ముతూ అక్రమంగా నగదు సంపాదిస్తూ జీవనం సాగిస్తున్నారు. డిజిల్ వ్యాపారం తగ్గడంతో మేదరమెట్ల దగ్గరలోని గ్రోత్‌సెంటర్ వద్ద హోటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంటాడు. దీంతో అక్రమంగా నగదును సంపాదించడానికి గంజాయి రావాణా చేయడం ప్రారంభించారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లోకి వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కేజీ గంజాయిని రూ. 10వేలు చొప్పున కోనుగోలు చేసి దానిని చిన్నచిన్న ప్యాకెట్లగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 200 నుంచి 500 వరకు మేదరమిట్ల, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో అమ్ముతూ నగదు సంసాదించుకుంటున్నారు.

# కన్నతల్లిని కట్టేసి నట్లు



కుప్పం/శాంతిపురం, జూలై 15(సందేశం టైమ్స్):కన్న తల్లిని స్వయంగా కన్నకొడుకే విద్యుత్ స్తంభానికి కట్టేసి.. ఆపై సవతి సోదరుడే ఆ పని చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి కూడా ఈ హైడ్రామాలో పాలుపంచుకున్నట్లు తర్వాత పోలీసుల విచారణలో తేలింది. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డీఎస్పీ పార్థసారథి, స్థానికుల కథనం మేరకు.. శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ తంబిగానిపల్లెలో మునెప్పకు మునెమ్మ, గంగమ్మ అనే ఇద్దరు భార్యలు. మునెమ్మ గతంలోనే మృతి చెందింది. ఆమెకు మంజునాథ్ అనే కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం జీవించి ఉన్న గంగమ్మకు సురేశ్ అనే కొడుకు ఉన్నాడు. సంతానానికి మునెప్ప ఎప్పుడో ఆస్తిని పంచి తన కోసం ఎకరా పొలం ఉంచుకున్నాడు. గంగమ్మ కొడుకు ఈ భూమిని సాగు చేసుకుంటున్నాడు. మునెప్ప వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయనకున్న ఎకరం భూమిలో తమకూ వాటా కావాలంటూ సురేశ్‌ను మంజునాథ్ డిమాండ్ చేశాడు. మంజునాథ్ భార్య ధనమ్మ, కుమార్తె కాంతమ్మ సురేశ్ సాగు చేస్తున్న ఎకరం దగ్గరకు వచ్చి.. తమకు భాగం పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ధనమ్మ, కాంతమ్మ వెళ్లిపోయిన తర్వాత సురేశ్.. గంగమ్మను పొలంలోనే ఉన్న విద్యుత్తు స్తంభానికి డ్రిప్ పైపులతో కట్టేశాడు. ఆపై వీడియో తీసి.. తన తల్లిని మంజునాథ్ కుటుంబం హింసించిందంటూ రాళ్లబూదుగూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు విచారించగా డ్రామా అని తేలింది. తప్పుడు ఫిర్యాదు చేసిన సురేశ్ కుటుంబంపై కేసు నమోదు చేసినట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేశ్ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించడానికి ఇటువంటి సంఘటనలను కొందరు వినియోగించుకుని వైరల్ చేస్తున్నారని డీఎస్పీ పార్థసారథి అన్నారు.

# ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి



కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 15(సందేశం టైమ్స్):: ఎన్నికల హామీ ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి అయినా అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ కార్యకర్తలు, నిరుద్యోగులు వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శనతో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో సంపాదన సృష్టించి 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని, అందుకు ప్రణాళిక కూడా సిద్ధ చేశామని బహిరంగంగా ప్రకటించి నిరుద్యోగ ఓట్లతో గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్టుమెంట్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల్లోని యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్ గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు కంచెను ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, పెద్దయ్య, రంజిత్‌గౌడు, జాఫర్‌పటేల్, నాగరాజు, నాయకులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో జివిఎంసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



ఆనందపురంజూలై 15(సందేశం టైమ్స్): మండలంలోని వేములవలన జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో జివిఎంసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సత్యాల వెంకట కిషోర్‌కుమార్ (25) దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. మండలంలోని దుక్కవానిపాలేనికి చెందిన వెంకట కిషోర్‌కుమార్ ప్రతిరోజూ వేకువజామున తన ఆటోలో మారికవలస వేటస్ట్ సీవరేజ్ ప్లాంట్‌కు మంచినీరు సరఫరా చేస్తుంటాడు. ఎప్పటిలాగా ఆటోలో నీటి సరఫరాకు వెళుతుండగా, వేములవలస శ్మశానవాటిక ఎదురుగా సిల్వర్ కంపెనీ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆటో ముందుభాగం నుజ్జునుజ్జవ్వగా, కిషోర్ గాయపడ్డాడు. తీవ్రగాయాలైన కిషోర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో సంఘటనాస్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రమాదానికి కారణాలు తెలియరాలేదన్నారు. అందుబాటులో ఉన్న సిసి టివి ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తామన్నారు. మృతుడు కిషోర్ జివిఎంసి వాటర్ సప్లై విభాగంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం ఆటో నడుపుతున్నాడు.

# కడపలో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య



కడప, జూలై 15(సందేశం టైమ్స్):జిల్లాలోని జమ్మలమడుగు పరిధిలో పర్యాటక కేంద్రమైన గండికోటలో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. ప్రొద్దుటూరులోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్న వైష్ణవిగా గుర్తించారు. నిన్న స్నేహితులతో గండికోటకు వెళుతున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లింది విద్యార్థిని. రాత్రి గడిచినప్పటికి విద్యార్థిని ఇంటిక రాకపోవడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైష్ణవి మిస్సింగ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఈరోజు (మంగళవారం) ఉదయం గండికోటలోని ముళ్లపొదల్లో ఓ అమ్మాయి నగ్నంగా శవమై పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా వైష్ణవిదిగా గుర్తించారు. ఆపై విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడకు చేరుకుని దారుణంగా హత్యకు గురైన కన్న బిడ్డను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఎర్రగుంట్ల మండలం హనుమాన్ దుర్తి గ్రామానికి చెందిన వాసి. విద్యార్థిని ఐదు సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన లోకేష్ అనే యువకుడితో ప్రేమవ్యవహారం ఉన్నట్లు సమాచారం. యువకుడు లోకేష్‌తో నిన్న బైక్‌పై వైష్ణవి గండికోటకు వెళ్ళినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. జమ్మలమడుగు పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని హత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# బంగారం పేరుతో రూ.15 లక్షల మోసం



నరసరావుపేట జూలై 15(సందేశం టైమ్స్): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి 75 ఫిర్యాదులు అందాయి. వీటిని స్వీకరించిన ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించడానికి పోలీసులు శ్రద్ధగా పని చేయాలని చెప్పారు.నకిలీ బంగారంతో మోసంనకిలీ బంగారంతో మోసపోయినట్లు మండల కేంద్రమైన దుర్గికి చెందిన షైక్ జానీబేగం ఫిర్యాదు చేశారు.. తనకు ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తక్కువ ధరకు బంగారం ఉందని, పరీక్ష చేయించుకునే కొనుక్కోవచ్చని చెప్పగా చెల్లెలు భర్తతో కలిసి భళ్లారి వెళ్లామని, అతని వద్ద రెండు కాయిన్స్ తీసుకొని హైదరాబాద్‌లో పరీక్ష చేయించగా అది ఒరిజినల్ బంగారమని తేలిందని చెప్పారు. అనంతరం రూ.15 లక్షలిచ్చి 250 గ్రాముల బంగారాన్ని కొన్నామని, ఆ తర్వాత దాన్ని పరీక్ష చేయించగా నకిలీదని రుజువైందని వివరించారు. తాము మోసపోయినట్లు తెలుసుకుని అజ్ఞాత వ్యక్తికి ఫోటో చేయగా స్విచ్ ఆఫ్ అయ్యిందని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన పెద్దవీరారెడ్డి భార్య అయిన నాగేంద్రంకు రూ.1.20 లక్షలు అప్పుగా ఇవ్వగా ఆమె తిరిగి చెల్లిటంచడం లేదని, పైగా భార్యాభర్తలిద్దరూ కలిసి బెదిరిస్తున్నారని అదే గ్రామానికి చెందిన వీరవల్లి హనిమిరెడ్డి ఫిర్యాదు చేశారు. పెళ్లయ్యి ఎనిమిదేళ్లయినా తనకు పిల్లలు పుట్టలేదనే కారణంతో భర్త దాసరి వెంకట్ జనార్ధన్‌రావు, అత్త మామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, గురజాలకు చెందిన నట్టువ సంధ్యారాణి ఫిర్యాదు చేశారు. తన భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఒక బిడ్డను కన్నాడని, తమకు న్యాయం చేయాలని కోరారు.తమను ఫైనాన్స్ సంస్థ సిబ్బంది డబ్బుల కోసం వేధిస్తున్నారని క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన చెరుకూరి నాగలక్ష్మి ఫిర్యాదు చేశారు.

# యువతి మోజులో పడి భర్త వేధింపులు ఉరివేసుకొని భార్య ఆత్మహత్య




వరంగల్ క్రైం/హసన్‌పర్తి/వరంగల్ మెడికల్, జూలై 15(సందేశం టైమ్స్): ఇన్‌స్టాలో రీల్స్ చేసే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంపై భర్తను నిలదీస్తే.. తీవ్ర మానసిక, శారీరక వేధింపులకు గురిచేయడం, విడాకులిచ్చేసి.. ఆమెనే పెళ్లి చేసుకుంటానని నిర్లక్ష్యంగా మాట్లాడటంతో ఆ భార్య తీవ్ర ఆవేదనకు గురైంది. చివరికి రీల్స్ చేసే ఆ యువతి కూడా ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేయడంతో దిక్కుతోచని స్థితిలో ఆ భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో ఈ ఘటన జరిగింది. భార్యాభర్తలిద్దరూ వైద్యులే! సీఐ చేరాలు కథనం ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్‌కు చెందిన హృద్రోగ నిపుణుడు అల్లాడి సృజన్ రెడ్డికి 2017లో హసన్‌పర్తికి చెందిన దంత వైద్యురాలైన ప్రత్యూష (35) తో వివాహం జరిగింది. సృజన్-ప్రత్యూష దంపతులకు జానూష (7), జెస్విక్రాస్ (7నెలలు) సంతానం. హసన్‌పర్తి కాకతీయ వింటేజ్ వెంచర్‌లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. ప్రత్యూష ఎన్‌ఎస్ఆర్ ఆస్పత్రిలో దంత వైద్యురాలిగా.. సృజన్‌రెడ్డి ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం సృజన్‌కు ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెంజర్ అయిన యువతి (25)తో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఇన్‌స్టాలో 2.33 లక్షల ఫాలోవర్లు ఉన్నారు.

# రూ.20 వేలకే కార్బన్ ఫైబర్ కృత్రిమ పాదాలు

అల్వాల్, జూలై 15(సందేశం టైమ్స్): కాలు విరిగిన లేదా పాదం కోల్పోయిన వారికి శుభవార్త! హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్) దేశీయ పరిజ్ఞానంతో అత్యాధునిక కార్బన్ ఫైబర్ కృత్రిమ పాదాలను (కార్బన్ ఫైబర్ ప్రొస్థెటిక్ ఫూట్) అభివృద్ధి చేసింది. ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పాదాలతో పోలిస్తే దాదాపు పదిరెట్లు తక్కువ ధరకే, అంటే కేవలం 20 వేలకే అందుబాటులోకి రానుంది. బీబీనగర్ ఎయిమ్స్‌లో డీఆర్‌డీఎల్ డైరెక్టర్, శాస్త్రవేత్త జీఏ శ్రీనివాసమూర్తి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతేమ్ శాంతసింగ్‌తో కలిసి ఈ



కృత్రిమ పాదాలను ఆవిష్కరించారు. రక్షణమంత్రిత్వశాఖకు చెందిన డీఆర్‌డీఎల్-డీఆర్‌డీవో సంయుక్తంగా ఈ'ఆప్టిమైజ్ కార్బన్ ఫుట్ ప్రొస్థెసిస్'ను రూపొందించాయి. దీనిని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేశారు. ఈ కృత్రిమ పాదం 125 కిలోల బరువు ఉన్న వ్యక్తులను కూడా మోయగలిగే సామర్థ్యం కలిగి ఉంది. వేగంగా నడిచేవారు, పరిగెత్తేవారు, దైనందిన పనులు చేసుకునే వారికి అనుకూలంగా 3 రకాలుగా దీనిని రూపొందించారు. తక్కువ ధరకే అందించడం దీని ప్రధాన ఉద్దేశం అని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు.

# నూతన సైన్స్ విధానంపై ప్రత్యేక దృష్టి

సీసీసీ నస్పూర్, జూలై 15(సందేశం టైమ్స్): నూతన సైన్స్ విధానంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య పేర్కొన్నారు. నస్పూర్‌లోని తీగల్‌పహాడ్‌లో గల పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన భౌతిక, జీవ, గణితం పాఠాలు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు.%డీఈవో మాట్లాడుతూ మారుతున్న అవసరాలకు అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందింపజేసే నూతన సైన్స్ పరికరాలను విద్యార్థులు వినియోగించుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రపంచంతో పోటీ పడాలంటే సైన్స్‌పై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. పాఠశాలలో నేటితో వంద అడ్మిషన్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వందో




అడ్మిషన్ పొందుతున్న విద్యార్థికి ఆయన అడ్మిషన్ అందజేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడానికి కృషి చేస్తున్న పాఠశాల హెడ్మాస్టర్ వామన్‌రావు, ఉపాధ్యాయుల బృందాన్ని ఆయన అభినందించారు. వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# పెద్దపులి కోసం గాలింపు..



రామారెడ్డి, జూలై 15(సందేశం టైమ్స్): కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో కలకలం రేపి న పెద్ద పులి కోసం గాలిం పు కొనసాగుతున్నది. రెండ్రోజుల క్రితం ఆవుపై దాడి చేసిన ఈ వన్య మృగం జాడ కోసం అటవీ శాఖ గాలిస్తున్నది. మూడు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని 30 మందికి పైగా సిబ్బంది రంగంలోకి దిగి అన్వేషిస్తున్నారు. అలాగే, ట్రాప్ కెమెరాలు, డ్రోన్లతోనూ ముమ్మరంగా గాలిస్తున్నారు. మరోవైపు, పశువులను కాపాడుకోవడానికి పెద్దపులిని హతమార్చేందుకు విష ప్రయోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ స్కూల్ తండా గ్రామ అటవీ శివారులోకి వచ్చిన పెద్దపులి ఓ ఆవుపై దాడి చేసింది. ఘటనా స్థలంలో ఆనవాళు సేకరించిన అటవీ శాఖ అధికారులు అది పెద్ద పులిగా నిర్ధారించారు. ఈ క్రమంలోనే దాని జాడ కోసం రెండ్రోజులుగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లభించలేదు. అయితే, పులి దాడి చేసి చంపేసిన ఆవు కళేబరంపై కొందరు విష ప్రయోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. పెద్దపులి బారి నుంచి తమ జీవాలను రక్షించుకోవాలన్న ఉద్దేశంతో పశువుల యజమానులు విష ప్రయోగానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. చంపేసిన ఆవు తినడానికి పెద్ద పులి మళ్లీ వస్తుందని భావించి కళేబరంపై విషం చల్లినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని మాచారెడ్డి రేంజ్ ఆఫీసుకు తరలించి విచారిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో దివ్య తెలిపారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నదని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. అయితే, విషం చల్లిన ఆవు కళేబరాన్ని పులి తిన్నది లేనిది అటవీ శాఖ అధికారులు చెప్పలేక పోతున్నారు. ఒకవేళ తింటే మృతి చెంది ఉంటుందని అనుమానిస్తున్నారు.

# వల్లభపూర్ లో అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కోటగిరి జూలై 15(సందేశం టైమ్స్): నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం వల్లభపూర్ గ్రామంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చోటుచేసుకుంది. కోటగిరి ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. వల్లభపూర్ గ్రామానికి చెందిన మేకల హనుమండ్లు (30) అని యువకుడు అప్పుల బాధ భరించలేక సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు గమనించిన కుటుంబీకులు, స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని దవఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం హనుమండ్లు మృతి చెందాడు. మృతుడి భార్య మేకల గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సునీల్ తెలిపారు.

# జల్లాపల్లి పాఠశాలలో విద్యుత్ కేబుల్ వైర్లు ధ్వంసం



పోతంగల్, జూలై 15(సందేశం టైమ్స్): గుర్తు తెలియని ఆకతాయిలు పాఠశాల గదుల తాళాలు పగలగొట్టి సీలింగ్ ఫ్యాన్లు, వాటర్ బోర్ కేబుల్స్, ట్యూబ్ లైట్లు ధ్వంసం చేశారు. ఈ సంఘటన మండలంలోని జల్లాపల్లి ఫారం ఉర్దూ పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయికుమార్ కథనం ప్రకారం.. రెండో శనివారం, రెండు రోజులు సెలవులు ఉండడంతో తిరిగి పాఠశాల తెరిచాం. లోపలికి వెళ్లి చూసేసరికి పాఠశాలలోని ఓ గది తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టారు.%గదిలోకి చొరబడి సీలింగ్ ఫ్యాన్లు, వాటర్ బోర్ కేబుల్స్, ట్యూబ్ లైట్లు, విలువైన స్విచ్ బోర్డు సర్వీస్ వైర్ ధ్వంసం చేశారు. దీంతో వాటర్ బోర్ పని చేయక విద్యార్థులు ఇబ్బందులు పడిన పరిస్థితి ఏర్పడింది. పోకిరీలు ఇలా తరుచుగా ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## హైటెన్షన్ వైర్లు తగిలి మహిళ దుర్మరణం

ఖమ్మం రూరల్, జూలై 15(సందేశం టైమ్స్):ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలంలోని కస్నాతండా గ్రామానికి చెందిన మహిళ విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగిలి మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా చేసి కార్యాలయంపై దాడి చేశారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. కస్నాతండాకు చెందిన మారుతి ముత్తమ్మ(44) ఉతికిన దుస్తులను డాబా గోడపై ఆరేసే క్రమంలో పైన హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగలడంతో మంటలంటుకొని అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

# ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్!



దేవరకొండ రూరల్, జూలై 15(సందేశం టైమ్స్):మండలంలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కావడంతో 35 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ పాఠశాలలో సుమారు 310 మంది విద్యార్థినులు చదువుతున్నారు. విద్యార్థినులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు సాయంత్రం విద్యార్థినులకు స్నాక్స్, పెసర గుగ్గిళ్లు అందజేశారు. రాత్రి బగారాతో చికెన్ భోజనం పెట్టా రు.%రాత్రి భోజనం తిన్న తర్వాత, కొంత మంది విద్యార్థినులు కడుపునొప్పి, విరోచనాలతో బాధపడ్డారు. ఉదయం అల్పాహారంగా పులిహోరా తిన్న తర్వాత 35 మంది తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలతో బాధపడ్డారు. దీంతో పాఠశాల ఏఎన్ఎం, టీచర్లు, 13 మంది విద్యార్థినులను దేవరకొండ దవాఖానలో 22 మందిని తూర్పుపల్లి పీహెచ్‌సీలో చేర్పించారు. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలియజేయడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో రమణారెడ్డి, పలు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ఆర్డీవో పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



# క్రీడావార్తలు



## నాయర్‌కు ఇక నో



న్యూఢిల్లీ: దేశవాళీ పోటీల్లో పరుగుల వరద పారిస్తుండడంతో వయసు (34) కూడా చూడకుండా అవకాశాలిస్తే వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్‌తో ప్రస్తుత సిరీస్ లోని మూడు టెస్టుల్లో వరుసగా 0, 20, 31, 26, 40, 14 స్కోర్లతో కనీసం ఒక్క ఫిఫ్టీ కూడా చేయలేకపోయాడు. 22 కంటే తక్కువ సగటుతో మూడు టెస్ట్‌ల్లో కలిపి 131 రన్స్ మాత్రమే చేశాడు. పైగా..బ్యాటింగ్ టెక్నిక్‌లో లోపాలు లేకపోలేదు. ఇవన్నీ చూస్తుంటే వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ తన కెరీర్‌లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడేసినట్టే కనిపిస్తోంది. ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన కరుణ్..ఇంగ్లండ్ పర్యటనను ప్రశంసనీయ రీతిలోనే ఆరంభించాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయడం ద్వారా టెస్ట్ తుది జట్టులో తనకు చోటు కల్పించక తప్పని పరిస్థితి కల్పించాడు. కానీ పేలవ ప్రదర్శనతో సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. భారత టెస్ట్ జట్టు భావి ఆటగాడిగా విశ్లేషకులు అంచనా వేస్తున్న 21 ఏళ్ల సాయి సుదర్శన్‌కు నాలుగో టెస్ట్‌లో అవకాశం ఇవ్వడమే సబబని మాజీ సెలెక్టర్ దేవంగ్ గాంధీ, మాజీ కీపర్ దీప్‌దాస్ గుప్తా అభిప్రాయపడ్డారు.

## టైటిల్‌పై సాత్విక్ జోడీ గురి



టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌పై భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి గురి పెట్టింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు టోర్నీల్లో సెమీస్ చేరిన సాత్విక్ జోడీ టైటిల్ సాధించలేకపోయింది. అయితే మంగళవారం నుంచి జరుగనున్న ఈ టోర్నీతో ఆ లోటును భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, చాలా కాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, పీవీ సింధు సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత రామ్‌రాజ్, డబుల్స్‌లో హరిహరన్-రుబాన్ కుమార్, కవిప్రియ-సిమ్రాన్ సింగ్, రుతుపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలోకి దిగుతున్నాయి.

## ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్



హైదరాబాద్: ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తమ కొత్త బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించుకుంది. న్యూజిలాండ్ మాజీ పేసర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ స్థానంలో వరుణ్‌ను తమ కోచింగ్ బృందంలోకి ఎస్ఆర్‌హెచ్ తీసుకుంది. 2011 నుంచి 2015 మధ్య వరుణ్ 9 టెస్టులు, 9 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో వరుణ్ చివరిగా ఆడాడు.

## ఆసీస్ కు ఆధిక్యం



కింగ్‌స్టన్: వెస్టిండీస్ తో జరుగుతున్న మూడో టెస్టు (డే/నైట్)లో ఆస్ట్రేలియాకు 82 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో బ్యాటింగ్ కొనసాగించిన వెస్టిండీస్ 143 పరుగులకు కుప్పకూలింది. క్యాంప్‌బెల్ (36) టాప్‌స్కోరర్. బోలాండ్‌కు మూడు.. కమిన్స్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 99 పరుగులు చేసింది. దీంతో ఓవరాల్‌గా 181 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. గ్రీన్ (42 బ్యాటింగ్) మాత్రమే రాణించాడు.

## అయ్యో.. సిరాజ్ బ్యాడ్‌లక్.. టీమిండియా ఎలా ఓటమి పాలైందో చూడండి..



విఖ్యాత లార్డ్స్ మైదానంలో ఉత్కంఠగా జరిగిన పోరులో టీమిండియా స్వల్ప తేడాతో ఓటమిపాలైంది. చివరి క్షణం వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియాను దురదృష్టం వరించింది . 193 పరుగుల ఛేదనలో 112 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన గడ్డు స్థితిలో జడేజా ) వీరోచితంగా పోరాడాడు. మరో ఎండ్‌లో బుమ్రా, సిరాజ్ కూడా అతడికి అండగా నిలిచారు. అయితే చివరి సెషన్ ఆరంభంలోనే విజయానికి 22 పరుగుల దూరంలో భారత్ అద్వితీయ సమరానికి చెక్ పడింది. చివరి వికెట్‌గా హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ అవుట్ టీమిండియా ఫ్యాన్స్ గుండెలు పగిలేలా చేసింది. టీ బ్రేక్ తర్వాత స్పిన్నర్ బషీర్ ఓవర్‌లో సిరాజ్ ఐదో బంతిని బ్యాక్‌ఫుట్‌తో డిఫెన్స్ ఆడాడు. కింద పడిన బంతి సిరాజ్ ప్యాడ్స్ పక్కనుంచి వెళ్లి లెగ్ స్టంప్‌ను తాకింది. సిరాజ్ గమనించేలోపే బెయిల్స్ కూడా కిందపడిపోయాయి. దీంతో సిరాజ్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ సంబరాలు మిన్నంటాయి. సిరాజ్ దురదృష్టవశాత్తు అవుట్ కాకుండా ఉండుంటే ఫలితం మరోలా ఉండేదేమో.ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అద్భుత పోరాట పటిమను ప్రదర్శించాడు. టెయిల్ ఎండర్స్ అండతో ఇంగ్లండ్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. 150 బంతుల్లో తన కెరీర్‌లోనే నెమ్మదైన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఓవర్‌లో నాలుగు నుంచి ఐదు బంతులు తానే ఆడడం.. చివరి బంతిని బౌలర్‌కు వదిలేయడం అనే ప్లాన్‌తో జడ్డూ బ్యాటింగ్ సాగించాడు. దీంతో బుమ్రా, సిరాజ్‌ను అవుట్ చేయడానికి ఇంగ్లండ్ బౌలర్లు నానా కష్టాలు పడ్డారు.

## ఉత్కంఠ పోరులో.. లార్డ్స్ చేజారె




ఆహా.. ఇది కదా టెస్టు క్రికెట్ మజా అంటే.. టీ20 జోరులో ఐదు రోజుల ఆటను బోరింగ్‌గా ఫీలయ్యే నేటి తరానికి విఖ్యాత లార్డ్స్ మైదానంలో భారత్ సాగించిన పోరాటాన్ని చూపాల్సిందే.. 193 పరుగుల ఛేదనలో 112 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన గడ్డు స్థితిలో జడేజా వీరోచితంగా నిలబడిన తీరు అపూర్వం. మరో ఎండ్‌లో బుమ్రా, సిరాజ్ ఏపాటి క్రీజులో నిలుస్తారులే అని అంతా భావించినా.. చక్కటి వ్యూహంతో జడేజా వీరి అండతోనే భారత్ పోరాటాన్ని మరో 35 ఓవర్లపాటు కొనసాగించి టెస్టుపై ఆశలు రేపాడు. కానీ ఆఖరి సెషన్ ఆరంభంలో విజయానికి 22 పరుగుల దూరంలో భారత్ అద్వితీయ సమరానికి చెక్ పడింది. తొలి సెషన్‌లో నాలుగు కీలక వికెట్లతో దెబ్బతీసి పైచేయి సాధించిన ఇంగ్లండ్ చివరికి మూడో టెస్టును దక్కించుకుంది.లండన్: ఇంగ్లండ్‌తో ఉత్కంఠ భరితంగా ముగిసిన మూడో టెస్టులో టీమిండియా పోరాటం ఫలితాన్నివ్వలేదు. టెయిలెండర్ల అండతో విజయం కోసం పట్టు వదలకుండా ప్రయత్నించినా దురదృష్టం వెంటాడింది. ఫలితంగా 193 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన గిల్ సేన ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు ఆలౌటైంది. దీంతో 22 పరుగుల తేడాతో గట్టెక్కిన ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. జడేజా (181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 61 నాటౌట్), రాహుల్ (39) మాత్రమే రాణించారు.

## కేఎల్ రాహుల్ ఔట్‌పై వివాదం.. కరెక్ట్ టైమ్‌లో దెబ్బ కొట్టారు!




ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లండ్ కథ ముగించిన భారత్.. లార్డ్స్‌లోనూ అదే పని చేస్తుందని అంతా అనుకున్నారు. క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన ఈ గ్రౌండ్‌లో జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ నెగ్గి సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్తుందని భావించారు. అందుకు తగ్గట్లే నాలుగు రోజులు దుమ్మురేపింది గిల్ సేన. దీంతో భారత్ విజయం ఖాయమని అభిమానులు ఆశలు పెంచుకున్నారు. కానీ బ్యాటర్లు చేతులెత్తేయడంతో మన జట్టు ఎదురీదుతోంది. వరుసగా వికెట్లు కోల్పోతూ వచ్చిన మెన్ ఇన్ బ్లూ.. ఓటమి అంచున నిలబడింది. అయితే మిగతా డిస్మిసల్స్ సంగతి పక్కనబెడితే.. కేఎల్ రాహుల్ ఔట్ మాత్రం వివాదాస్పదంగా మారింది. దీనిపై బ్యాటింగ్ గ్రేట్ సునీల్ గవాస్కర్ స్పందించాడు.రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు కేఎల్ రాహుల్. 58 బంతుల్లో 39 పరుగులు చేసిన స్టైలిష్ బ్యాటర్.. అప్పటివరకు బాగానే బ్యాటింగ్ చేస్తూ వచ్చాడు. కానీ స్టోక్స్ వేసిన అద్భుతమైన డెలివరీకి అతడు వెనుదిరగక తప్పలేదు. స్టోక్ మీద పడిన బంతి దిశ మార్చుకొని వేగంగా లోపలి వైపుకు దూసుకురావడంతో దాన్ని డిఫెండ్ చేయలేకపోయాడు రాహుల్. ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేయగా.. అంపైర్ ఔట్ ఇవ్వలేదు.

## లార్డ్స్ బాల్కనీలో గంగూలీ సంబరాలు.. జోఫ్రా ఆర్చర్‌కు ఎలా స్ఫూర్తినిచ్చాయంటే..



మైదానంలో భారత్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ అద్భుత ప్రదర్శన చేశాడు జం ఆర్చర్ అద్భుతమైన బంతితో ప్రమాదకర రిషబ్ పంత్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను అద్భుతంగా అందుకున్నాడు. ఐదో రోజు ఆర్చర్ తీసిన ఆ రెండు వికెట్లే భారత పరాజయాన్ని శాసించాయి. అయితే జోఫ్రా ఆర్చర్ అద్భుత ప్రదర్శన వెనుక 2002 నాటి గంగూలీ ఐకానిక్ వేడుక స్ఫూర్తిగా పని చేసిందట. ఈ విషయాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చెప్పాడు.సరిగ్గా ఆరేళ్ల క్రితం అంటే 2019 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జులై 14వ తేదీనే జరిగింది. లార్డ్స్ మైదానంలోనే జరిగిన ఆ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. ఆ విజయం కాస్త వివాదాస్పదమే అయినప్పటికీ ఇంగ్లండ్ సాధించిన ఒకే ఒక ప్రపంచకప్ అది. తిరిగి ఆరేళ్ల తర్వాత అదే రోజున (జులై 14) భారత్‌తో మూడో టెస్ట్‌ను కూడా అదే లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ గెలిచింది. ఐదో రోజు ఆటకు ముందు ఆర్చర్‌కు ఆ విషయాన్ని బెన్ స్టోక్స్ గుర్తు చేశాడట. ఈరోజు ఏంటో తెలుసా అని అడిగాడట. బెన్ స్టోక్స్ 2019 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ గురించి అడిగితే..

# బిజినెస్



## మరింత పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



బంగారం ధర మళ్లీ పెరుగుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. పది గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలను దాటి ట్రేడ్ అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 15న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 890కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 560కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రెండొందలు పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1,00,040కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 710కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 890కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 560కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## ఇండియాలో షో రూమ్ ఓపెన్ చేసిన టెస్లా.. కార్ల ధర ఎంతంటే..




ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కార్ల షో రూము ఇండియాలో ఓపెన్ అయింది. ఇండియాలో తొలి షో రూము మంగళవారం ఉదయం ముంబైలోని బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభం అయింది. ప్రస్తుతం ఈ షో రూములో వై మోడల్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్లను మాత్రమే అమ్మకానికి ఉంచారు. వై మోడల్ కార్లు రెండు వేరియంట్స్‌లో అందుబాటులో ఉన్నాయి. లాంగ్ రేంజ్ ఆర్‌డబ్ల్యూడీతో పాటు లాంగ్ రేంజ్ ఏడబ్ల్యూడీ కార్లు మాత్రమే అమ్మకానికి ఉన్నాయి.ఈ వై మోడల్ కార్లలో.. రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్‌కు సంబంధించిన ధర 59.89 లక్షల రూపాయల నుంచి మొదలవుతుంది. టెస్లా కార్ల ధరలు ఇండియాలో ఇంత పెద్ద మొత్తంలో ఉండటానికి ఇంపోర్ట్ డ్యూటీస్ కూడా ఓ కారణం. విదేశీ కార్లపై ఇండియా ఏకంగా 70 నుంచి 100 శాతం ఇంపోర్ట్ టాక్సులు వేస్తోంది. తన కార్లపై ఇండియాలో అధికంగా టాక్సులు వేయటంపై ఎలన్ మస్క్ ఇది వరకే భారత ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేశారు. అధిక టాక్సులు తగ్గించాలని కోరారు.అయితే, భారత ప్రభుత్వం మాత్రం టాక్సుల విషయంలో వెనక్కు తగ్గలేదు. అమెరికానుంచి కార్లను ఇండియాకు ఇంపోర్ట్ చేసే బదులు.. ఇండియాలోనే ఓ యూనిట్ పెట్టి కార్లను ఇక్కడే తయారు చేయాలని చెప్పింది. ఈ విషయంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. మరి, మస్క్ ఇండియాలో టెస్లా కార్ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తారో.. లేదో వేచి చూడాలి.

## స్టాక్‌మార్కెట్లకు లాభాలు.. ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..




గత కొన్ని రోజులుగా నిరాశాజనకంగా కదలాడుతున్న దేశీయ సూచీలు ఎట్టకేలకు లాభాల బాట పట్టాయి. కనిష్టాల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో మార్కెట్లు సానుకూలంగా స్పందిస్తున్నాయి. త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్లకు కలిసి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. ఐటీ, ఫార్మా రంగాలు నష్టాల్లో కొనసాగుతుండగా, బ్యాంకింగ్ రంగం లాభాలను ఆర్జిస్తోంది ముగింపు (82, 253)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 250 పాయింట్లు లాభపడి 82, 495 వద్ద గరిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 208 పాయింట్ల లాభంతో 82, 462 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 77 పాయింట్ల లాభంతో 25, 159 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో పిరామిల్ ఎంటర్‌ప్రైజెస్, బంధన్ బ్యాంక్, హీరోమోటోకార్ప్, పీజీ ఎలక్ట్రోఫాస్ట్, ఫోర్టిస్ హెల్త్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్, ఐనాక్స్ విండ్, మ్యాన్‌కైండ్ ఫార్మా, గ్లెన్‌మార్క్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 236 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 295 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.93గా ఉంది.

## ఐటీ కొలువుల్లో చిన్న నగరాల హవా




న్యూఢిల్లీ: ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తెలంగాణలోని వరంగల్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు.. మెట్రో నగరాలను మించిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి–జూన్ మధ్య కాలంలో ఈ నగరాల్లో ఐటీ నియామకాలు, గత ఏడాది ఇదే కాలం తో పోలిస్తే 50 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటు 12 నుంచి 15 శాతం మించలేదు. కంపెనీలకు నియామక సేవలు అందించే టీమ్‌లీజ్ డిజిటల్ సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ప్రధాన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు అన్నిటిలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోందని ఆ సంస్థ పేర్కొంది.

## ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం




న్యూఢిల్లీ: వరుసగా కొన్ని నెలలుగా తగ్గుతూ వస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో మరింతగా తగ్గి 2.1 శాతానికి దిగొచ్చింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. 2019 జనవరిలో నమోదైన 1.97% తర్వాత ద్రవ్యోల్బణం ఇంత దిగువకు రావడం ఇదే ప్రథమం. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం వరుసగా ఇది ఎనిమిదో నెల. రుతుపవనాలు సకాలంలో రావడం, విస్తృతంగా వ్యాపించడం కారణంగా ఆహార వస్తువుల ధరలు.. పత్యేకించి కూరగాయల ధరలు –19 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ఇవి కాకుండా పప్పులు, పప్పు ఉత్పత్తులు (–11.76్న), మాంసం, చేపలు (–1.62్న), తృణ ధాన్యాలు, అనుబంధ ఉత్పత్తులుబీ చక్కెర, కన్ఫెక్షనరీ, పాలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాల (–3.03్న) ధరలు కూడా జూన్‌లో గణనీయం గా తగ్గాయని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎసఓ) తెలిపింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెలలో 2.82 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 5.08 శాతంగా ఉంది.గత నవంబరు నుంచి ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్‌బీఐ) ప్రభుత్వం నిర్దేశించిన ద్రవ్యోల్బణం కట్టడి కనిష్ఠ పరిమితి 2 శాతానికి (ఎగువకు లేదా దిగువకు 2్న సద్దుబాటుతో 4్న స్థాయికి కట్టడి) అతి చేరువకు వచ్చింది. ఈ కారణంగా వచ్చే నెల మొదటి వారంలో జరుగనున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో వడ్డీ రేటు మరింతగా తగ్గించవచ్చని అంటున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం మేరకు తగ్గించింది.

## ఎల్‌ఐసీ చీఫ్‌గా దొరైస్వామి




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) కొత్త సారథిగా ఆర్ దొరైస్వామి నియమితులయ్యారు. మూడు సంవత్సరాల కాలానికి ఎల్‌ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ఆయనను నియమిస్తూ ఆర్థిక సర్వీసుల శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2028 ఆగస్టు 28 వరకు అంటే 62 సంవత్సరాల వయసు వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఎల్‌ఐసీలో ఎండీ, సీఈఓతో పాటు నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లుంటారు.ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.444.79 కోట్ల డివిడెండ్‌ను అందించింది.

## తగ్గిన హెచ్‌సీఎల్ టెక్ లాభం

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో 9.7 శాతం క్షీణించి రూ.3,843 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.4,257 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 8.1 శాతం పెరిగి రూ.28,057 కోట్ల నుంచి రూ.30,349 కోట్లకు చేరింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006